

# రోజుకో పద్యం

మల్లాది హనుమంతరావు

# రోజుకో పద్యం

(కొన్ని ప్రసిద్ధమైన తెలుగుపద్యాలు, సరళ వ్యాఖ్యానంతో)

మల్లాది హనుమంతరావు

**రోజుకో పద్యం**

(కొన్ని సుప్రసిద్ధమైన తెలుగు పద్యాలు, సరళ వ్యాఖ్యానంతో)

**మల్లాది హనుమంతరావు**


మొదటి ముద్రణ : 2009



© హక్కులు రచయితవి



డిటిపి : శ్రీమతి రాజకుమారి, శ్రీ మోసెస్

ముద్రణ :


ప్రతులకు


**మల్లాది హనుమంతరావు**

302, సిద్ధార్థ గీతాంజలి,

F-50, మధురానగర్,

హైదరాబాద్ – 500 038.

ఫోన్ : 23735188, 99493 40236


మరియు

రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలలు

వెల : **రూ. 75/-**

## పాఠకులకు మనవి

ఇటీవలే (డిసెంబర్, 2008లో) సాహిత్యాభిలాష గల సామాన్య పాఠకుల ప్రయోజనం కోసం, ఒక కొత్త తరహాలో, నూట పదహారు ప్రసిద్ధ సంస్కృత శ్లోకాలను, సరళమైన తెలుగు అనువాదంతో, లఘు వ్యాఖ్యలతో జోడించి, 'రోజుకో శ్లోకం' పేరుతో నేను ప్రకటించిన పుస్తకాన్ని పాఠకలోకం ఎంతగానో ఆదరించింది. అది ఈనాటి పాఠకులకు పనికొచ్చే ప్రయత్నం అని పాఠకులూ, సమీక్షించిన పత్రికలూ ప్రోత్సహించటం జరిగింది. అతి తక్కువ సమయంలో ఆ పుస్తకం పునర్ముద్రణ పొందింది.

అదే తరహాలో నూట పదహారు తెలుగు పద్యాలతో రూపొందించబడింది 'రోజుకో పద్యం' అనే ఈ పుస్తకం. దానిలాగే ఇదీ సాహిత్యాభిలాష గల సామాన్య పాఠకులను ఉద్దేశించిందే. దాదాపు పదో తరగతి దాకా స్కూల్లో తెలుగు ఒక విషయంగా చదువుకొన్న సగటు పాఠకుడికి, తెలుగులో దిగ్గజాలనిపించుకొన్న మహాకవుల పద్యాలు కొన్ని గుర్తు చేసుకొని వాటిలో అందాలూ, విశేషాలూ యథాశక్తి ఆస్వాదించేందుకు అనువుగా ఈ పుస్తకం రూపొందింది. వీలయినన్ని చక్కని తెలుగు పద్యాలూ, వీలయినంత మంది మహానుభావుల కవిత్వపు నమూనాలు పాఠకుల ముందుంచే ప్రయత్నం ఇది. ఇందులో పద్యాలు రససిద్ధులైన కవీశ్వరులవి. వ్యాఖ్యలు పండిత ప్రకాండుల వివరణలను అనుసరించినవి. ఆ మహానుభావులందరికి శత సహస్ర కృతజ్ఞతాపూర్వక అభివందనాలు.

అర్థం కాని చదువు వ్యర్థం కనుక ఈ పుస్తకంలో ప్రతి పద్యానికి సరళమయిన భాషలో క్లుప్తంగా అర్థం ఇవ్వడం జరిగింది. ఈ పద్యాల్లో మనకు తారసపడే కష్టమయిన పదాలన్నింటికీ తేలిక భాషలో అర్థం సూచించబడింది. అవసరమయిన చోట్ల ప్రతిపదార్థం ఇవ్వబడింది. తెలుగు వారందరూ నేర్చుకోవాల్సిన ప్రసిద్ధ పద్యాలు అనదగ్గ వాటిలో, నూట పదహారు మాత్రమే ఈ పుస్తకంలో కూర్చబడ్డాయి. ప్రాచీన కవుల పద్యాలూ, ప్రబంధ కవుల పద్యాలూ, శతక పద్యాలూ, చాటువులూ, ఆధునిక కవుల పద్యాలూ, బాగా ప్రచారం పొందిన నాటక పద్యాలూ వీటన్నిటి నుంచీ కొన్ని మణిపూసలను ఏరి కూర్చటం జరిగింది. అందరు మహాకవుల పద్యాలూ యిచ్చేందుకు అవకాశం చాలలేదు. మరీ సుదీర్ఘమయిన పుస్తకాలూ, సుదీర్ఘమయిన వ్యాఖ్యానాలూ చదివేందుకు నేటి సామాన్య పాఠకుడికి సమయం సరిపోదని అందరికీ తెలుసు. కనుక ఈ పుస్తకం నూట పదహారు పద్యాలకు మాత్రమే పరిమితమయింది. పాఠకులకు ఆసక్తికరంగా ఉండేందుకు ప్రసిద్ధ పద్యాలకూ, మరీ కఠినంగా ఉండని పద్యాలకూ, విషయ వైవిధ్యానికీ ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. ఏ పద్యాలు, ఎలా ఎంపిక చేసినా, ఇలాంటి సంకలనాలలో అసమగ్రత తప్పేది కాదు.

ఈ పద్యాలు పాఠకుడు స్వయంగా చదువుకొని, నేర్చుకోవటం పుస్తకం ప్రధానోద్దేశం. పద్యం సుబోధమవుతుంది అనిపించిన చోటల్లా సంధులు విడగొట్టి యివ్వటం జరిగింది. అరసున్నాలూ, శకటరేఫలూ యివ్వలేదు. అచ్చు తప్పులూ, ఇతర దోషాలూ తొలగించేందుకు శక్త్యానుసారం కృషి చేసినా, తెలిసో తెలియకో మిగిలిపోయిన దోషాలేవైనా ఉంటే క్షంతవ్యుణ్ణి.

రోజుకొక పద్యం చొప్పున ఈ పుస్తకంలో పద్యాలన్నీ పాఠకుడు ఆరునెలల లోపున కంఠస్థం చేసుకోవచ్చు. అలా చేసుకోగలిగితే, 'మనిషికి వాక్కు భూషణం' అన్నారు గనుక, మన పెద్దలు ఎంతో ప్రేమతో మనకు వారసత్వంగా అందించిన నూట పదహారు ఆభరణాలు మన సొంతం చేసుకొని నిరంతరంగా ధరించవచ్చు! ఈ పద్యాలు సమయం దొరికినప్పుడల్లా మననం చేసుకొని ఆహ్లాదం పొందవచ్చు. ఈ సాహిత్య సౌరభాన్ని, మనం ఆస్వాదించడమే కాక, సంఘంలో మనకు తటస్థపడ్డ మిత్రులందరికీ అక్షయంగా పంచవచ్చు. పండితులు చెప్పినట్లు:

**శ్రవణ సుభగమైన ఛందోనియతి గల్గి**
**యతులు గలిగి ప్రాస గతులు గలిగి**
**తీపిలయలు గలిగి తెలుగులో పద్యాలు**
**హొయలు గలిగి యెడద లూపగలవు!**

ఈ పుస్తకం ప్రచురణలో తోడ్పడిన మిత్రులందరికీ నా కృతజ్ఞతలు. అముద్రిత ప్రతి చదివి, చక్కని సలహా లిచ్చిన విదుషీమణి డా॥ శ్రీమతి కిళాంబి జ్యోతిర్మయి గారికీ, శ్రీ ఇప్పగుంట సాయిబాబా గారికీ, శ్రీ జి.ఆర్.కె. మూర్తి గారికీ, శ్రీ రామోరా (చీరాల) గారికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. డిటిపి చేసి ఇచ్చిన శ్రీమతి రాజకుమారి, శ్రీ మోసెస్ గార్లకూ, ఓపికగా ఎన్నో దిద్దుబాట్లు చేసి పెట్టిన శ్రీమతి ఎస్. అరుణాదేవి గారికీ, శ్రీ టి. రాజేంద్రప్రసాద్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

జులై, 2009 **మల్లాది హనుమంతరావు**
హైదరాబాదు

## శ్రీ గణేశాయ నమః

**ఉ. తొండము, నేక దంతమును, తోరపు బొజ్జయు, వామ హస్తమున్**
**మెండుగ మ్రోయు గజ్జెలును, మెల్లని చూపులు, మందహాసమున్,**
**కొండొక గుజ్జు రూపమున, కోరిన విద్యల కెల్ల నొజ్జయై-**
**ఉండెడి పార్వతీ తనయ-ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్.**

*ప్రార్థన పద్యం, చాటువు*

ఏ శుభకార్యం ప్రారంభించినా 'తొలుత నవిఘ్నమస్తనుచు' హిందువులు మొట్టమొదట స్మరించే దేవుడు శ్రీగణాధిపతి. ఆదిదంపతులు పార్వతీపరమేశ్వరుల ముద్దుబిడ్డ. సాధారణంగా ఇతర దేవతల పూజలన్నీ గణపతి పూజ తర్వాతనే. ఈ 'రోజుకో పద్యం' ప్రణాళికను కూడా గణపతికి నమస్కరించి, ఆయన ఆశీస్సులతో ప్రారంభం చేయటం ఉత్తమం.

తెలుగులో ఈనాటికీ విరివిగా ప్రచారంలో ఉన్న పద్యాలను వాటి ప్రాచుర్యం బట్టి ఒక వరసలో చెప్తే, ఈ పద్యం మొట్టమొదటి స్థానంలో ఉంటుంది. రాసిన ధన్యుడెవరో తెలియదు.

వినాయకుడు తెలుగువారి అభిమాన దేవతలలో ఒకడు. మిగతా పండగలు జరుపుకొనే సంప్రదాయాలు కాలక్రమేణా బలహీనపడి పోయినా, దీపావళి-వినాయకచవితి లాంటి కొన్ని పండగలు మనం యింకా పాత తరాల పద్ధతిలోనే జరుపుకొంటున్నాం. పండగలన్నీ భగవంతుడిని వివిధ నామరూపాలలో తలచి, కొలిచేందుకే కానీ ఏడాదికొకసారన్నా ప్రత్యేకంగా కూర్చొని ఓ గంటసేపు విధిగా పూజచేసే ఆచారం ఒక్క వినాయకుడి పండుగ విషయంలోనే ఇంకా మిగిలి ఉంది.

ఆ పూజ సందర్భంలో ఆబాలగోపాలం చెప్పుకొనే పద్యం కనక, ఆ విధంగా నయినా ఇది నలుగురి నాలుకల మీద నిలిచి ఉన్న పద్యం. ఈ పద్యం నోటికి రానివారు తేలికగానే కంఠస్థం చేసుకోగలిగిన, చేసుకోదగిన పద్యం.

'తొండమూ, ఏకదంతమూ, పెద్ద (**తోరపు**-స్థూలమయిన) బొజ్జా, పొట్టిచేయీ (**వామ**-సుందరం, హ్రస్వం, వక్రం) బాగా మోత చేసే గజ్జెలూ, మెల్లని చూపులు, చిరునవ్వూ, కొంచెం మరుగుజ్జు రూపంతో (**కొండొక**-కొంచెం) కోరిన విద్యలన్నిటికీ గురువు (**ఒజ్జ**-గురువు)గా ఉండే అగజా సుతా, (**పార్వతీ తనయ!**) ఓ గణపతీ! నీకు నమస్కరిస్తున్నాను'.

భారతీయ దేవతలలో నరమృగ సంయుక్త రూపాలు కల మూర్తులకు సాంకేతికార్థం తప్పకుండా ఉంటుంది, అంటారు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ. గజాననుడి స్వరూపం ఓంకారానికి రూపకల్పన అంటారాయన. అలాగే ఏకదంతం భేదజ్ఞానం నశించిన అద్వైత జ్ఞానిని సూచిస్తుందంటారు.

# అనాది-మధ్య-లయుడు

**ఉ. ఎవ్వనిచే జనించు జగ, మెవ్వని లోపల నుండు లీనమై,**
**ఎవ్వని యందు డిందు, పరమేశ్వరు డెవ్వడు, మూలకారణం**
**బెవ్వ, డనాది మధ్య లయు డెవ్వడు, సర్వము-తానయైన వా**
**డెవ్వడు, వాని నాత్మభవు, నీశ్వరునే శరణంబు వేడెదన్.**

*బమ్మెర పోతన,* ***ఆంధ్ర మహాభాగవతం 8.73***

ఈ ప్రార్థన భాగవతంలో గజేంద్రమోక్షం ఘట్టంలోది. 'తొండము నేకదంతమును' పద్యం తరువాత తెలుగులో బహుళ ప్రచారం పొందిన రెండో పద్యం బహుశా ఇదే అవుతుంది.

మొసలితో వెయ్యి సంవత్సరాల పాటు యుద్ధం చేసి పూర్తిగా అలిసిపోయాడు గజరాజు. ఒళ్ళు హూనమయిపోయింది. ఉత్సాహం నశించిపోయింది. ఏం చెయ్యాలో ఎలా బయటపడాలో పాలుపోలేదు. కేవలం తన ప్రయత్నంతో ఈ ఆపద నించీ బయటపడలేనని తెలిసిపోయింది. జన్మాంతర సంస్కారం వల్ల పరమభక్తుడు కావటం వల్ల త్రికరణశుద్ధిగా, ఆర్తిగా, అతి దీనంగా దేవుణ్ణి ప్రార్థించాడు.

'ఈ జగం ఎవరివల్ల పుడుతున్నదో, ఎవరిలో కలిసి లీనమై ఉంటుందో, చివరికి నాశం పొంది ఎవరిలో లయమైపోతుందో (**డిందు**-అణగిపోవు, నశించు, ఇంకిపోవు) ఈశ్వరులకు ఈశ్వరుడయిన సర్వేశ్వరుడెవరో, ఎవరు సృష్టికి మూలకారణమో, ఎవరు ఆది-మధ్య-అంతం లేనివాడో, ఎవరు సర్వమూ తానే అయినవాడో, వాడిని, ఆ ఆత్మభవుడి (తన నుంచి తనే ఉద్భవించినవాడి)ని నేను శరణు కోరుతున్నాను'.

**'సర్వధర్మాన్ పరిత్యజ్య మాం-ఏకం శరణం వ్రజ!'** (అన్ని ధర్మాలను వదిలిపెట్టి, నన్నొక్కడినే శరణు చేరు) అన్న భగవద్గీత చరమ శ్లోక సందేశాన్ని గజేంద్రుడు ఆచరిస్తున్నాడు.

**'యతో వా ఇమాని భూతాని జాయంతే, యేన జాతాని జీవంతి, యత్ప్రయంతి, అభిసంవిశంతి, తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి!'** (దేనినించీ ఈ భూతకోటి పుడుతున్నదో, దేని వల్ల పుట్టిన భూతకోటి జీవిస్తున్నదో, జన్మాంతంలో ఎందులో లీనమవుతున్నాయో దాన్ని తెలుసుకోవటానికి యత్నించు. అది బ్రహ్మ అని) అన్న తైత్తిరీయోపనిషత్తు మంత్రాన్ని ఈ పద్యం స్ఫురింపచేస్తున్నది. పురాణాల ముఖ్య ప్రయోజనం శ్రుతులలో చెప్పిన బోధలను కథలూ, గాథల ద్వారా జనబాహుళ్యానికి చేర్చటం. గజేంద్రమోక్షం లాంటి కథల ఉద్దేశ్యం అదే.

పోతే, ఇక్కడ ఈశ్వరుడంటే, పరమేశ్వరుడంటే పార్వతీ పతి శివుడు కాదు. సర్వసమర్థుడూ, సకల శక్తిమంతుడూ, ప్రభువులకు ప్రభువయిన సర్వేశ్వరుడు. ఆ సర్వేశ్వరుడిని శ్రీమన్నారాయణ మూర్తిగా భావించి ప్రార్థిస్తున్నాడు గజేంద్రుడు.

# శ్రీరఘురామ!

**ఉ. శ్రీ రఘురామ! చారు తులసీదళ దామ! శమక్షమాది శృం**
**గార గుణాభిరామ! త్రిజగన్నుత శౌర్యరమా లలామ! దు**
**ర్వార కబంధ రాక్షస విరామ! జగజ్జన కల్మషార్ణవో**
**త్తారక నామ! భద్రగిరి దాశరథీ! కరుణా పయోనిధీ!**

*కంచర్ల గోపన్న,* ***దాశరథీ శతకం 1***

పుణ్యక్షేత్రాల మాహాత్మ్యానికి మూడు గీటురాళ్ళు. ఒకటి దైవం, రెండోది తీర్థం, మూడోది క్షేత్రం. ఈ మూడు రకాలా విశిష్టమయినది భద్రాచల క్షేత్రం. 'రెండవ సాటి దైవమికలే'దనిపించుకున్న శ్రీరామచంద్రమూర్తి యిక్కడి దైవం. పావన గోదావరి యిక్కడి తీర్థం. క్షేత్రం అరణ్యవాసకాలంలో సాక్షాత్తూ సీతారాముల బహుకాల నివాసం చేత పునీతమయిన క్షేత్రం.

భద్రాద్రి అనగానే భద్రాచల రామదాసు వెంటనే గుర్తుకు వస్తాడు. తానీషా గుర్తుకొస్తాడు. దాశరథీ శతకం గుర్తుకొస్తుంది.

పై ప్రార్థన, దాశరథీ శతకంలో మొట్టమొదటి పద్యం. బాగా ప్రసిద్ధి చెందిన పద్యమే. పద్యంలో అన్నీ శ్రీరాముడిని ఉద్దేశించిన సంబోధనలు.

**'శ్రీరఘురామ** – రఘువంశానికి చెందిన శ్రీరామా!

**చారు–తులసీదళ–దామ** – అందమైన–తులసీదళాల–మాల ధరించినవాడా!

**శమ–క్షమాది–శృంగార–గుణ–అభిరామ** – శాంతమూ, ఓర్పూ మొదలయిన–చక్కని–గుణాలచేత ఒప్పువాడా!

**త్రి–జగత్–నుత–శౌర్య–రమా–లలామ** – మూడు–లోకాలచేత–నుతించబడ్డ –పరాక్రమ–లక్ష్మి అనే–అలంకారం కలవాడా!

**దుర్వార–కబంధ–రాక్షస–విరామ** – జయించటానికి అలవికాని–కబంధుడనే– రాక్షసుడిని వధించిన వాడా!

**జగజ్జన–కల్మష–అర్ణవ–ఉత్తారక–నామ** – లోకంలో–జనుల–పాప–సముద్రాన్ని –దాటించగల–నామం (రామనామం) కలవాడా!

**భద్రగిరి–దాశరథీ!** – భద్రాద్రిలో వెలసిన–దశరథ నందనా!

**కరుణా–పయోనిధీ** – దయా–సముద్రా!'

ఈ పద్యానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి 'గణపతి' హాస్య నవలలో నిరక్షర కుక్షి అయిన గణపతి ఈ ధోరణిలో తాత్పర్యం చెప్తాడు: 'శ్రీరాములవారు, అరణ్య వాసంలో ఓసారి చారు చేయించుకొన్నారట. దాన్లో వేసేందుకు కరివేపాకు దొరకక తులసీదళాలు వేసుకొన్నారట. ఆ చారు తాగిన వాళ్ళకి శమ, క్షమాది సద్గుణాలు కలిగాయట.....' వగైరా.

## శ్రీ మాత్రే నమః

**ఉ. అమ్మలగన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల పె**
**ద్దమ్మ, సురారులమ్మ కడుపారడి పుచ్చిన యమ్మ, తన్ను లో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ, దుర్గ, మా**
**యమ్మ, కృపాబ్ధి, యిచ్చుత మహత్వ, కవిత్వ, పటుత్వ సంపదల్.**

*బమ్మెర పోతన, ఆంధ్ర మహాభాగవతం* ***1.10***

ఆంధ్ర భాగవతం ఆరంభిస్తూ బమ్మెర పోతనగారు రచించిన ఇష్టదేవతా స్తుతి పద్యాలలో ఇదొకటి. సుప్రసిద్ధమయిన పద్యం. మనసును కదిలించే భక్త్యావేశంతో నిండి ఉన్న మహోజ్జ్వలమయిన పద్యం.

పోతనగారు ఇందులో దుర్గాదేవిని ప్రార్థిస్తున్నాడు.

'ఆమె అమ్మలందరికీ అమ్మ. లక్ష్మీ, పార్వతీ, సరస్వతీ అనే ముగ్గురు అమ్మలకూ మూలమయిన అమ్మ. అందరికంటే అధికురాలు **(చాల పెద్దమ్మ)**. రాక్షసుల తల్లికి పుత్రశోకం కలిగించిన తల్లి **(సురారుల-అమ్మ-కడుపు-ఆరడి పుచ్చిన-అమ్మ)**. రాక్షసుల తల్లి దితి సంతానంలో ప్రముఖులయిన ఎందరో రాక్షసులను దుర్గాదేవి సంహరించాల్సి వచ్చింది.

తనను మనసులో, మనసారా, నమ్మిన దేవతా మాతల మనసులో నిలిచి ఉండే తల్లి. ఈ దుర్గమ్మ, మా అమ్మ, కరుణా సముద్ర. నాకు గొప్పతనాన్నీ, చక్కని కవిత్వం చెప్పే శక్తినీ, బలాన్నీ యిచ్చుగాక!'

చిన్న చిన్న మాటలతో, ఉదాత్తమయిన భావాలతో, శక్తిమంతమయిన కవితాధారతో, పాఠకులను వివశుల్ని చేసి, భక్తివాహినిలో మునకలు వేయించగలగటం బమ్మెర పోతన్నగారికున్న ఒక అతి ప్రత్యేకమయిన, ఉత్కృష్టమయిన, లోకాతీతమయిన శక్తి.

అమ్మలయమ్మ దుర్గమ్మను ఇంత అద్భుతమయిన పద్యంతో ప్రార్థిస్తే, అసలే ఆమె కరుణా పయోనిధి **(కృపాబ్ధి)**, కరిగిపోయి ఆయన అడిగిన మహత్వ, కవిత్వ, పటుత్వాలు ఇబ్బడిముబ్బడిగా, అతి ఉదారంగా ఆయనకు ధారపోసింది కదా. ఆయన వెనక నిలబడి, ఆయన పద్యంతోనే మనమూ ఆమెను స్తుతిస్తే ఆమె కటాక్షం మనమీదా, యథాప్రాప్తం, ప్రసరించకబోతుందా?

ఈ పుస్తకంలో మొదటి అయిదు పద్యాలుగా, ప్రసిద్ధమయిన అయిదు తెలుగు ప్రార్థనాపద్యాలను సంకలించాలని సంకల్పించితే, వాటిలో మూడు, కేవలం యాదృచ్ఛికంగా, పోతన్న గారివయిపోయాయి. ఇందులో సంకలనకర్త పక్షపాతం లేదు. పక్షపాతమంటూ ఉంటే అది తెలుగుజాతికే ఉంది, మహాకవి పోతనగారి పట్ల. ఉండటమే కాదు, బాగా గట్టిగా, దట్టంగా ఉంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2048**

* * *